ఎండ @ 41

- తీవ్రమైన భానుడి భగభగలు
- గతేడాది కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారానికి భానుడి భగభగలు తీవ్రమవుతూ వచ్చాయి. ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి చివరి వారానికి భానుడు భగభగలాగుతున్నాడు. అప్పటి నుంచి పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెల ప్రారంభంలో కర్నూలు నగరంలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో 36 డిగ్రీలు, ఆలూరులో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయింది. అది పెరుగుతూ వచ్చి మార్చి 26 నాటికి కర్నూలు, ఓర్వకల్లులో అధికంగా 39 డిగ్రీలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో మంగళవారం అత్యధికంగా కర్నూలులో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎమ్మిగనూరు, కోడుమూరులో 40, ఆలూరు, ఆదోనిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా ప్రస్తుతం 41కి చేరింది. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

అసమానతలను తుదిముట్టిదాం

ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్

మాట్లాడుతున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - కౌతాళం

దేశంలో నేటికి కొనసాగుతున్న సమాజిక, ఆర్థిక అసమానతలను తుది ముట్టిద్దామని ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో మహాత్మ పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తోవి, చూడి, బాపురం గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విక్టర్ ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, అరుణోదయ సాంస్కృతిక వేదిక ఎపిటిఎస్ రాష్ట్ర చైర్మన్ విమలక్క, రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ నాయకులు రాజు మాట్లాడారు. మనువాదులు రాజ్యాంగంపై, ప్రజల హక్కులను అణచివేయడానికి ఎన్నో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారన్నారు. వాటిని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరు విద్యావంతులై రాజ్యాంగ హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెప్పిన మాటలను సమీకరించు-బోధించు-పోరాడు అనే అంశాలు ఎప్పటికీ మరవరాదన్నారు. నేటికీ కూడా గ్రామీణ ప్రాంతాలలో కుల వివక్ష, దళిత మైనార్టీలపై దాడులు, అంటరానితనం, అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నదులు ప్రవహిస్తున్న కూడా తాగడానికి నీళ్లు కూడా అందించలేని స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వినోద్ కుమార్, వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి, ఉరుకుంద ట్రస్ట్ చైర్మన్ నాగరాజు గౌడు, వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాదాచారి, ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, సిఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ జగన్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు గురునాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, అంబేద్కర్ కమిటీ నాయకులు అవతారం, జైపాల్, వీరేష్, పాల్ దినకరన్, తిమోతి, ఆయా గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జి జి హెచ్‌లో కోవిడ్‌పై మాక్ డ్రిల్

కోవిడ్ మాక్‌డ్రిల్‌లో వైద్యాధికారులు సి.ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం కోవిడ్ సన్నద్ధంలో భాగంగా ట్రై ఏజ్ ఏరియా, జగనన్న ప్రాణ వాయువు, ఆక్సిజన్ ప్లాంట్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, సర్జికల్ స్టోర్లలో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని కోవిడ్ కేసులు ఏవైనా ఎమర్జెన్సీగా వచ్చిన, వాటిపై సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోవిడ్ ఫోర్త్ వేవ్ వస్తే ఎలా ఎదుర్కోవాలో మాక్ డ్రిల్ ద్వారా తెలిపారు. కరోనా మాక్ డ్రిల్‌లో వైద్యాధికారులు, డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది హాజరయ్యారని తెలిపారు. ఓల్డ్ గైనిక్ బ్లాక్ (ట్రై ఏజ్ ఏరియా) కోవిడ్ పేషెంట్లకు 40 బెడ్స్ వెంటిలేటర్స్, 40 ఆక్సిజన్ ఫోర్స్ రెడీ చేసామన్నారు. వారికి కావాల్సిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు పెరిగున ఎడల మరిన్ని బెడ్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జగనన్న ప్రాణ వాయువు ఆక్సిజన్ ప్లాంట్ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, ఆక్సిజన్ నిలువలు , ఆక్సిజన్ సామర్థ్యాన్ని పరిశీలించి వాటి గురించి ఆరా తీశారు. సర్జికల్ స్టోర్‌ను పరిశీలించి అనంతరం పిపికిట్స్, మాస్కులు, ఎమర్జెన్సీ మెడిసిన్స్ గ్లౌజెస్, పల్స్ ఆక్స్ మీటర్స్ అందుబాటులో ఉండాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమానలిని, వైద్య అధ్యాపకులు డాక్టర్ రామ్ శివ నాయక్, అడ్మిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ వైద్యులు నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలకు స్వస్తి పలకాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన
- ఘనంగా మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన చిత్రంలో కర్నూలు ఎంపి, మేయర్,ఎమ్మెల్యేలు

పూలే విగ్రహం దగ్గర నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యేలు, గురుశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలో బాల్యవివాహాల వ్యవస్థకు పూర్తిగా స్వస్తి పలకాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. మంగళవారం కర్నూలులో మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని బిర్లా గేట్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, బిసి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు శరీరంనగర్ లోని జ్యోతిబాపూలే అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే అందరికీ ఆదర్శప్రాయమన్నారు. సమాజంలో కుల, మత విభేదాలు లేకుండా లింగ విభేదాలు లేకుండా మనిషిని మనిషి ఏ విధంగా గౌరవించాలనేది విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిబా పూలే అహర్నిశలు కృషి చేశారన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యనిస్తూ వారి కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బిసి భవన్ నిర్మాణానికి ఎంపి ల్యాండ్స్ ద్వారా నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆఫీస్ ఖాన్ మేయర్ రామయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుంది అన్నారు. రాజకీయాల్లో మహిళలకు అనేక పదవులను కట్టబెట్టిన ఘనత తమ ప్రభుత్వానికి చెందుతుందన్నారు. పూలే విగ్రహాన్ని సెంటర్లో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను వారు కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, నగర డిప్యూటీ కమిషనర్ రమాదేవి, బిసి వెల్ఫేర్ ఇడి ఎ. నాగేశ్వరరావు, వార్డు కార్పొరేటర్, ఆర్‌డిఒ హరిప్రసాద్, మాజీఎంపీ బుట్టా రేణుక, వివిధ సంఘాల బిసి ప్రజా సంఘాల నాయకులు, ఎస్‌సి, ఎస్‌సి, బిసి, మైనార్టీ నాయకులు సత్యనారాయణమ్మ, గడ్డం రామకృష్ణ, నక్కల మిట్ట శ్రీనివాసులు, శేషఫణి, నగేష్, నాగేశ్వర యాదవ్, ఎం శ్రీనివాసులు, వివి రమణమూర్తి, లక్ష్మీ కాంతయ్య, ధనుంజయ ఆచారి, అడ్వకేట్ మురళి, గురుశేఖర్, బాల సంజన్న, కె.శివరాం, పట్నం రాజేశ్వరి, రామకృష్ణ శకుంతల, మోహన్, హేమంత్ గౌడ్, ఈశ్వరయ్య, హుస్సేన్, రాజు, రమణ, సోమేశ్, తిరుపాల్, బాబు, రాంబాబు, ఆనంద్, కృష్ణాజీరావు, మద్దిలేటి, సురేష్, బాబు, రేవతి, కోటేశ్వరయ్య, సుధారాణి పాల్గొని మహాత్మ జ్యోతిరావు బాపులే సేవలను కొనియాడారు.

రాయలసీమ యూనివర్శిటీలో

రాయలసీమ యూనివర్సిటీలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ ఆకే పోగు ఆనందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ సుందరానందపుచ్చా, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేరు రాణి , ప్రొఫెసర్లు మధుసూదన్ వర్మ, డాక్టర్ భరత్ కుమార్, ఇతర అధ్యాపకు బృందం, బోధనేతర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు, ఇతర కాంగ్రెస్ నాయకులు జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బతకన్న దామోదరం రాధాకృష్ణ బజారన్న పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు జయరాజు, రవికుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుపిఎఫ్ నేతలు డిఇఒను కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట్ రంగారెడ్డిని యుటిఎఫ్ ప్రతినిధి బృందం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, సహ అధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి నవీన్ పాటిల్, జిల్లా నాయకులు తిమ్మనలు పాల్గొన్నారు. 1998 లో ఎంపికైన క్వాలిఫైడ్ ఉపాధ్యాయులకు జరుగుతున్న కౌన్సిలింగ్లో రోస్టర్ పాటించాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులు పోస్టింగుల్లో పదోన్నతి లు కన్ఫర్మ్ చేయాలన్నారు. పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఎపి మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎపి జెఎసి అమరావతి పిలుపుమేరకు మలిదశ ఉద్యమంలో భాగంగా సెల్ డౌన్ కార్యక్రమంలో భాగంగా సిఆర్ఆర్ఎంఎం సి ఉన్నత పాఠశాల, ఎస్ఎపి క్యాంపు, కర్నూలు నందు స్వల్ప విరామ సమయంలో ఉపాధ్యాయులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రఅధ్యక్షులు టి.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థికపరమైన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుగుణమ్మ, సరోజ, శివన్నారాయణ, దేవేంద్రప్ప , కవితాదేవి, రఘు, చాంద్ బాషా, సువర్ణ గౌరి, శైలజ, రంజిత కుమారి, శ్రీలత, భీమ రాయుడు, సౌజన్య, శివలక్ష్మి దేవి, విమల, శివకుమారిబాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై టిడిపి అసత్య ప్రచారాలు : వైసిపి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు ఎంత మాత్రం పెరగలేదని.. ఈ విషయం పై టిడిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కర్నూలు, నంద్యాల జిల్లాల వైసిపి అధ్యక్షులు బివై. రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గృహ వినియోగ విద్యుత్ టారిఫ్ చార్జీల భారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎలక్ట్రిసిటీ యాక్ట్ ప్రకారం 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి ఎపిఇఆర్‌సి లెక్కల ప్రకారం డిస్కంలు నష్టపోయే రూ. 10,135.22 కోట్ల మొత్తాన్ని ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకుందని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు అడ్డగోలు పాలనతోనే డిస్కంలు నష్టాల్లోకి కూరుకుపోయాయని అన్నారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ చట్టం ప్రకారం డిస్కంలు నష్టపోయే మొత్తం ప్రతి 3 నెలలకు ఒకసారి బేరీజు వేసుకుని వినియోగదారుల నుంచి వసూలు చేసుకునే అవకాశం ఉన్నా ఆ భారం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. కొత్త టారిఫ్ పాలసీ ప్రకారం పిండిమిల్లుల మొదలు చేనేతలకు ఉచిత, సబ్సిడీ పథకాలను తమ ప్రభుత్వం వర్తింప చేస్తోందని తెలిపారు. నెలకు 200 యూనిట్ల లోపు వినియోగించే ఎస్సీ, ఎస్టీ కుంటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ కోసం రూ. 7,641 కోట్లు, ఆక్వారంగానికి 1,206 కోట్లు ఇతర వర్గాలకు 1,238 కోట్ల సబ్సిడీ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని స్పష్టం చేశారు. టిడిపి ఇకనైనా తన మీడియాలో కనిపిస్తూ ప్రజలను మభ్యపెట్టే పబ్లిసిటీ స్టంట్లు మానుకోవాలని సూచించారు.

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

పూలే జయంతి సభలో మాట్లాడుతున్న గురుశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 197 వ జయంతి సందర్భంగా స్థానిక బిర్లాగేట్‌లో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ కర్నూలు ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసులు అధ్యక్షురాలు జయమ్మ. న్యూ సిటీ కార్యదర్శి సి.శేషాద్రి జిల్లాన్ కమిటీ సభ్యులు సి. రవిశంకర్. నగర నాయకులు వీరేష్ ఎల్లయ్యలు పూలే విగ్రహానికి పూలమాల వేశారు. సభలో ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురు శేఖర్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్తగా ఉద్యమకారుడుగా సంఘ సేవకుడిగా పూలే భారత దేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం పేద అణ గారిని అంటరాని ప్రజల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడాడారన్నారు. ఏరోజైతే మనిషి బానిసగా మారుతాడో ఆరోజునే అతని సద్గుణాల్లో సగభాగం నశిస్తాయి అన్న గ్రీకు మహాకవి హుమరు మాటల స్ఫూర్తితో శూద్ర అతిశూద్ర జాతుల విముక్తి కోసం పూలే జీవితాంతం దృఢంగా పోరాడారన్నారు. కుల వివక్షను ఎదిరించి బడుగు వర్గాల హక్కుల కోసం కృషిచేసిన మహనీయులుగా పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధన కోసం కృషి

మహాత్మా జ్యోతిరావు పూలే 197జయంతిని సుర్జీత్ భవన్ లో సిఐటియు, ఆవాజ్ ఓల్డ్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాన్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ల విజయ్ మాట్లాడుతూ మహాత్మ పూలే స్త్రీలు చదవడం తప్పన్న కాలంలో మనువాదాన్ని ఎదిరించి స్త్రీల చైతన్యం కోసం మొదట తన భార్యకు చదువు నేర్పించి పంతులమ్మను తయారు చేశారన్నారు. బాల్య వివాహాలను సతీసహగమనాన్ని వ్యతిరేకించిన గొప్ప మానవతావాది అని వారన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ నగర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, సిఐటియు నగర్ ఆఫీస్ బేరర్స్ నాగస్వాములు, మైమూద్, ఖాజా పాష, కుమార్,వెంకటేష్, చంద్ర, నాసిర్ మొదలగువారు పాల్గొన్నారు.

పూలేకు నివాళ్లు అర్పిస్తున్న గౌరు దంపతులు

పూలే చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ఉల్చాల గ్రామంలో రైతు సంఘం జెండావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ కిసాన్ సభ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ 1936వ సంవత్సరంలో ఏర్పడిన కిసాన్ సభ దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. బెంగాల్లో తే.బా.గా పోరాటం మహారాష్ట్రలో వర్లి ఆదివాసుల పోరాటం, కేరళలో పున్నపురాయిలార్ పోరాటం అన్నిటికీ తలదన్నె విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సాయుధ రైతాంగ తెలంగాణ పోరాటం జరిగిన ఘన కీర్తి అఖిల భారత కిసాన్ సభకు ఉందని చెప్పారు. నాడు నిర్వహించిన పోరాటాల ఫలితంగా పాలకులు దిగివచ్చి అనేక రకాల చట్టాల రూపకల్పన చేశారన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్రానంతరం కూడా రైతుల పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక నీటి వసతి లేక నకిలీ విత్తనాలు ఎరువులు పురుగుల మందుల ధరలు విపరీతంగా పెరిగి వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. ఈ పరిస్థితి నేటి పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నదన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, నేటి పాలకులు వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన వారు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహారాష్ట్ర రాష్ట్రంలో నాసిక్ నుండి ముంబై వరకు 2000 కిలోమీటర్లు 2018లో మండుటెండలో పాదయాత్ర చేసి రైతుల తమ డిమాండ్లను సాధించుకున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వలన ఈ సంవత్సరం నాసిక్ నుండి మరొకసారి మండుటెండలో పాదయాత్ర చేసి నేడున్న ప్రభుత్వంతో రాతపూర్వకమైన హామీని పొందారన్నారు. మహత్తరమైన పోరాటాలు ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, రైతులు మాధవరెడ్డి, వెంకటయ్య, తిరుపతిరెడ్డి, నారాయణ ,ఇస్మాయిల్ ఇంకా అనేకమంది రైతులు పాల్గొన్నారు మంగళవారం జిల్లాలో పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో జెండావిష్కరణలు జరుగుతున్నట్లు రామకష్ణ తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లోఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎం.డి అంజిబాబు కోరారు. ఈ మధ్యకాలంలో కార్మిక శాఖ మంత్రులు గుమ్మనూరు జయరాం కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రాన్ని మంత్రి డిపిఒకు పంపించగా ఈ విషయమై డిపిఒ నాగరాజు నాయుడును కలిసి వారు చర్చించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా పంచాయితీలలో 12 నెలలుగా వేతనాలు పెండింగులో ఉన్నాయని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల వల్ల వారు తగిన ఆహారం తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వస్తున్న అతి తక్కువ వేతనం కూడా నెల నెలా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని, వారికి వెంటనే వేతనాలు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 15 ఆర్థిక ప్రణాళిక బడ్జెట్ వచ్చిన వెంటనే అందులో కొంత భాగాన్ని కేటాయించి వేతనాలు చెల్లించే విధంగా తగిన ప్రణాళిక రూపొందించి వారికి వేతనాలు అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిపిఒ మాట్లాడుతూ తగిన విధంగా ఆదేశాలు జారీ చేసే దానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.



రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో గౌరుచరితరెడ్డి

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం: టిడిపి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని టిడిపి పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31 వ వార్డ్ శరీన్ నగర్ లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గౌరు చరిత రెడ్డి కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పెంచిన నిత్యవసర వస్తువుల ధరల గురించి వివరించారు. 31 వ వార్డ్ ఇంచార్జి వార్డ్ శైలజ యాదవ్,వార్డ్ నాయకులు కష్ణ, ఏసు, ఆదం, చిన్న స్వామి, సురేష్, మహిళలు సువర్ణ, సుజాత, మహాలక్ష్మి, మేరీ, కల్లూరు అర్బన్ వార్డ్ నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగి రెడ్డి, బిసి సెల్ రాష్ట సెక్రటరీ కాసాని మహేష్ గౌడ్, తెలుగు యువత రాష్ట సెక్రటరీ శేఖర్ చౌదరి, మాదేశ్, జిల్లా కార్యదర్శి కెతురు మధు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి పర్యటించండి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సిపిఎం నాయకులు

మండలం పరిధిలో పాండవగల్ గ్రామంలో మంగళవారం గడపగడపకు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి సమస్యలతో స్వాగతం పలికిన సిపిఎం నాయకులు, గ్రామస్తులు, గ్రామ సమస్యలు పరిష్కరించే గ్రామాలలో పర్యటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి కే.లింగన్న మాట్లాడుతూ మా గ్రామంలో సుమారు 20 ఎకరాల పెద్ద చెరువు భూస్వామి అక్రమంలో ఉందని ఇది కోర్టులో పెండింగ్లో ఉందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని కోరారు. గ్రామానికి గత 40 సంవత్సరాలుగా పేదలకు ఇళ్ల స్థలం ఇవ్వలేదని, వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నలుగురు టీచర్లను నియమించి, ఇళ్లపై వెళ్లిన విద్యుత్ తీగలను తొలగించాలన్నారు. పక్కా సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి పాండవగల్ నుండి కుప్పగల్ రైల్వే స్టేషన్ వరకు రోడ్డును ఆర్ అండ్ బి లో చేర్చి తారు రోడ్డు వేయాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జే రామాంజ నేయులు, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శులు కే గోవిందు, కే పాండురంగ, ఎస్ అనిఫ్, వార్డు సభ్యులు మా బాష, కృష్ణ హుస్సేనీ, పార్టీ సభ్యులు హనుమంత రెడ్డి, నర్సిరెడ్డి, భీమయ్య, పార్టీ సానుభూతిపరులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పండ్లు, పూల మొక్కలను పెంచుకోండి

- జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

చీని తోటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి

వ్యవసాయ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకొని, వ్యవసాయ బావులు, బోర్లకు రైతులకు ఉచితంగా అందిస్తున్న పండ్ల పూల మొక్కలను పెంచుకొని అభివృద్ధి చెందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కరివేమల,పాలకుర్తి గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పథకం పనులను, రైతులు వేసుకున్న చీని,కొబ్బరి మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఏపిడి పద్మావతి, ఏపీవో కృష్ణమూర్తి, జేఈ రంగస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ నాయక్ ఉన్నారు.

యాచకుడి డబ్బులు దోచుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఆలూరు

హోళగుంద మండలంలోని ఎంతో ప్రసిద్ధి గాంచిన ఎల్లార్తిలో భిక్షాటన చేస్తూ అనారోగ్యభారిన పడిన మహమ్మద్ షరీఫ్ అనే యాచకుడి దగ్గర నుండి రూ.3లక్షల 20వేలు దోచుకున్న రాముడు, గాది అనే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని హోళగుంద సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆలూరు జ్యోతిబసు భవన్లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న యాచకుడు మహమ్మద్ షరీఫ్కు తన డబ్బుతో అధికారులు ఆసుపత్రిలో చూపించాలన్నారు. ఎల్లార్తి క్షేత్రానికి అనేక మంది భక్తులు ఆంధ్ర, తెలంగాణతో పాటు మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి వస్తుంటారని, అక్కడ యాచకులకు కూడా సరైన భద్రత లేదన్నారు. వచ్చిన భక్తులకు కొంతమంది నిలువుదోపిడికి గురి చేస్తున్నార న్నారు. దాతలు ఎల్లార్తి కి వచ్చిన భక్తుల ఉచితంగా సేద తీర్చుకోవడానికి,నిద్రించడానికి భక్తుల కొరకు తమ సొంత ఖర్చులతో సత్రాలు కట్టిస్తే ఆ సత్రాలకు రుసుము చెల్లించాలని లేకపోతే ఇక్కడ ఉండటానికి వీలులేదని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. భక్తులను నిలువు దోపిడీ చేస్తుంటే బెదిరింపులకు పాల్పడుతుంటే వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారులు నిద్రపోతున్నారా అని మండిపడ్డారు. ఎల్లార్తి లో వక్ఫ్ బోర్డు అధికారులు పర్యవేక్షించి భక్తులకు అందుబాటులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు, భక్తులకు భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హాలహర్వి సిపిఎం మండలం కృష్ణ, హోళగుంద సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైన, సిపిఎం నాయకులు ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ప్రజాభీష్టం మేరకు రాష్ట్రంలో పాలన

: ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజాభీష్టం మేరకు రాష్ట్రంలో వైసీపీ పాలన కొనసాగుతోందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని 20వ వార్డు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శ్రీ కోటఈశ్వర స్వామి దేవాలయం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, వార్డు ఇన్ చార్జ్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ బంగి శ్రీరామ్ కన్వీనర్లు యుయు. నగేష్, భవనమ్మ, కురువ లక్ష్మన్న, గృహసారథులు వాల్మీకి శ్రీను, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌పై ప్రజలకు నమ్మకం

మంత్రాలయం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంటేనే ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు వైసిపి నాయకులు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం జగనన్న భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక పాత ఊరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభు త్వం అందించిన సంక్షేమ పథకాల అమలు తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 829 6082960 నెంబర్‌కు మిస్డ్ కాల్‌లను ఇప్పించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న మా భవిష్యత్తు స్టికర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, నాయకులు వికేసి రఘు విశ్వనాథాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రచార పాదయాత్ర

జయప్రదం చేయండి : సిపిఎం సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు : మాట్లాడుతున్న నాయకులు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, నియోజవర్గ నాయకులు హనుమంతు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి జి.రంగన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం జాతీయ సమితి పిలుపుమేరకు ఈ నెల 14 నుండి 30 తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల, ప్రజావ్యతిరేక నిరంకుశ పాలనపై సిపిఐ-సిపిఎం ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఉమ్మడి క్యాంపియన్ ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు .ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఎమ్మిగనూరు నియోజవర్గంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ ఎమ్మిగనూరు,నందవరం, గోనెగండ్ల, మండల కార్యదర్శులు బీటీ చిన్నన్న, గిడ్డయ్య,నాగప్ప, సిపిఐ సీనియర్ నాయకులు సత్యన్న, జబ్బర్, రాజీవ్, సిపిఎం నాయకులు రాముడు, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు:** బిజెపి ప్రభుత్వం దేశంలోని సంపదను,రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ప్రజలకు తెలిపి చైతన్యం కలిగించేందుకు సిపిఎం,సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టే రాజకీయ ప్రచార భేరీని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి కోరారు. మంగళవారం స్థానిక జ్యోతి బస్సు భవనంలో సిపిఎం, సిపిఐ పార్టీల ఉమ్మడి సమావేశం సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శాకీర్, కెపి.నారాయణ స్వామి, సిపిఐ తాలూకా నాయకులు భూపేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహానికి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐల ఆధ్వర్యాన నిర్వహించనున్న రాజకీయ ప్రచార భేరిని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి కొమ్ముకాస్తున్నా యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీ విధానాలను అందరికంటే ముందుగా అమలు చేస్తూ విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను, ఆస్తిపన్నులను పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హాలహర్వి మండల కార్యదర్శి కృష్ణ, హోళగుంద మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, హోళగుంద సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, సిపిఎం నాయకులు విఠల్,మైన, ఏఐటీయూసీ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు. **ఆదోని:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 14 నుండి 30 వరకు దేశవ్యాప్తంగా జరుగు ప్రచార భేరిని జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు వెంకటేశులు, అజయ్ బాబు కోరారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పట్టణ కార్యదర్శిలు లక్ష్మన్న, సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, మండల కార్యదర్శులు బసాపురం గోపాల్, లింగన్న, నాయకులు తిప్పన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలూరు : మాట్లాడుతున్న కెపి.నారాయణస్వామి

మా విలువలను కాపాడండి

- సర్పంచులు

ప్రజాశక్తి- దేవనకొండ

సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న వెలమకూర్ సర్పంచ్ భాస్కర్

గ్రామాల్లో టిడిపి సర్పంచులకు ఎలాంటి సమాచారం లేకుండానే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మంజూరు చేసిన తాగునీటి బోర్లను వేస్తున్నారని తమని భాగస్వామ్యం చేసి తమ విలువలను కాపాడాలని వెలమకూరు, నేలతలమర్రి సర్పంచులు భాస్కర్, పద్మజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్లు మాట్లాడుతూ గత రెండేళ్లుగా పంచాయతీల సర్పంచులకు నిధులు కేటాయిం చక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని, కనీసం వీధిలైట్లు వేసే పరిస్థితి కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామ కానికి తమ తీర్మానాలు పంపినప్పటికీ సిబ్బం దిని భర్తీ చేయ కపోవడం దారుణం అన్నారు. దేవనకొండ ఎంపిటిసి తపాల శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం తహశీల్దారు వెంకటేష్ నాయక్, ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీవో గౌరీదేవి, అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి సూర్యనా రాయణ, మండల విద్యాశాఖ అధికారి రంగస్వామి, ఏపివో కృష్ణమూర్తి, సిహెచ్ఓ భాగ్యలక్ష్మి, వెలుగు సిసి నరసన్న, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నర్సప్ప కొండను పరిశీలించిన నిపుణుల బృందం

ప్రజాశక్తి - గోనెగండ్ల

కొండను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, నిపుణుల బృందం

మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎండవేడికి చీలికలు ఏర్పడ్డ నర్సప్ప కొండను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగిని సమక్షంలో జెఎన్‌డబ్ల్యూ నుంచి సచిన్ టింగే, గ్రీన్ కో సంస్థకు చెందిన నిపుణులు రమేష్ రితేష్, సంతోష్ పాండే బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నిపుణుల బృందం ఇప్పటికి ప్పుడు కొండను పూర్తిస్థాయిలో తొలగించేందుకు వీలుకాదని అయితే కొండ నుంచి ఎలాంటి ప్రమాదము సంభవించకుండా తీసుకోవలసిన చర్యల గురించి సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. కొండ రాళ్లకు ఏర్పడిన చీలికలలోకి గాలి నీరు చొరబడకుండా ఉండేందుకు పగుళ్లను సిమెంటుతో నింపడంతో పాటు కొండ చుట్టూ నాలుగు అడుగుల మేర కాంక్రీట్‌తో రక్షణగోడ ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయవలసిందిగా ఆర్అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, ఎస్పై తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రంగనాయకులు, వెంకటేష్ ఉన్నారు.

సందర్శించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గోనెగండ్ల మండల ఎంపీపీ నసరుద్దీన్ పాటు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నర్సప్ప కొండను సందర్శించారు. కొండరాళ్ల పగుళ్లను పరిశీలించి స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొండ పగుళ్ల నుంచి సమీపంలో ఇళ్లకు గానీ ప్రజలకు గాని ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, సిబ్బందికి సూచించారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి - ఆదోని

పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించిన నాయకులు

కర్నూలు జిల్లాలో నారా లోకేష్ యువగళం పాదయాత్రను సమిష్టిగా కృషి చేసి జయప్రదం చేద్దామని టిడిపి నాయకులు తెలిపారు. మంగళ వారం లోకేష్ పాదయాత్ర రూట్ మ్యాప్‌ను నాయకులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, సుజాతమ్మ, మీనాక్షి నాయుడు, తిక్కారెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆరెకల్‌లో ఏర్పాటు చేసిన సమావేశ ంలో వారు మాట్లాడారు. ఈనెల 13న డోన్ నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర ప్రవేశిస్తుందన్నారు. పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలను కలిపే విధంగా యాత్ర కొనసాగుతుం దన్నారు. పాదయాత్రకు సంబంధించిన టీం సభ్యులు రూట్ మ్యాప్‌ను పర్యవేక్షించడం జరిగిందన్నారు. లోకేష్ పాదయాత్రను దిగ్విజయం చేసే దిశగా సమిష్టిగా పాటుపడాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

ఘర్షణకు ఘర్షణకు పాల్పడిన దృశ్యం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలో బిసిలకు, ఎస్‌సిలకు ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల మేరకు.. ఎస్‌సిలకు సంబంధించిన మారెమ్మ దేవాలయం స్థలం విషయంలో ఈ వివాదం చెలరేగింది. తమ మారెమ్మ గుడి స్థలంలో ఎందుకు ఇళ్లు కట్టుకుంటారని ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, బిసిలను నిలదీశారు. దీంతో తమకే ఎదురు చెబుతావా అంటూ బిసి సామాజిక వర్గానికి చెందిన వారు ఎస్‌సిలను కులం పేరుతో దూషిస్తూ గూటలతో దాడికి దిగారు. బిసిలకు సర్ది చెప్పి గొడవలు లేకుండా ప్రశాంతంగా పంచాయతీ చేసి మాట్లాడుదాం అని వెళ్లిన ఎస్‌సి పెద్దలను, కొంత మంది బిసి యువకులు దాడి చేసేందుకు ప్రయత్నించారు. కట్టెలతో దాడి చేసేందుకు ప్రయత్నించడంతో భయాందోళన వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే పూర్వం ఎస్‌సి కులానికి చెందిన మారెమ్మ గుడి ఇక్కడే ఉండేది. అయితే మారెమ్మ దేవాలయం పాతది కావడంతో గత 25 సంవత్సరాల క్రితం వేరే చోట ఎస్‌సిలు కట్టుకున్నారు. పాత మారెమ్మ గుడి స్థలం ఖాళీగా ఉండటంతో అక్కడే ఉన్న కొంత మంది బిసి కులానికి చెందిన వారు ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. దీంతో ఎస్‌సి పెద్దలు తమ మారెమ్మ గుడి స్థలంలో ఎందుకు ఇళ్లు నిర్మిస్తున్నారని, ఎవ్వరిని అడిగారని ఎస్‌సి కులం పెద్దలు ముకుమ్మడిగా వెళ్లి వారిని నిలదీశారు. దీంతో మాట మాట పెరిగి దాడి చేసుకున్నారు. ఈ దాడిలో గాయపడిన ఎస్‌సి కులానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాలను విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పూలే ఆశయాలకు అంకితం అవుదాం

ప్రజాశక్తి - విలేకరులు

ఎమ్మిగనూరు : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు ప్రతి ఒకరు అంకితం అవుదామని సిపిఎం జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, వృత్తి సంఘాల జిల్లా నాయకులు పి గోవిందు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి హనుమంతు, సిఐటియు డివిజన్ నాయకులు రాముడు, కెవిపిఎస్ నాయకులు ఆంటోనీ, చేనేత నాయకులు కృష్ణ ప్రజాసంఘాల నాయకులు అబ్దుల్లా, రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. **గోనెగండ్ల :** జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మండల కేంద్రమైన గోనెగండ్లలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు దండు ఖాజా, గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు తిరుపతయ్య నాయుడు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే తాను విద్యావంతుడు అవ్వడమే కాకుండా తన భార్య సావిత్రిబాయికి విద్య నేర్పించి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తయారుచేసి బాలికల కొరకు పాఠశాలలను ఏర్పాటు చేసి మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. బ్రిటిష్ కాలంలోనే సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారుడుగా, సంఘ సేవకుడిగా, కుల వివక్షతకు వ్యతిరేకంగా పూలే పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు వీరన్న గౌడ్, సిఐటియు నాయకుడు బతకన్న, హమాలి సంఘం నాయకుడు హనుమంతు, తదితరులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆనందరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ కూడలి నందు , మండల పరిధిలోని సోగానూర్ ఎస్సీ కాలనీ నందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అంతోని, గుంటేప్ప, భాస్కర్, సురేష్, సుమాల రాజు, కలుగొట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు. **పెద్దకడబూరు :** పెద్దకడబూరు గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ నందు రంగన్న ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో ప్రిన్సిపాల్ రంగన్న మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అంటరాని తనంపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్య అవకాశాలు కల్పించిన సంఘసంస్కర్త పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆదోని:** బాలికలకు విద్యా జ్యోతి, అణగారిన ప్రజలకు ఆశాజ్యోతి మహాత్మా జ్యోతీబా పూలే అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కొనియాడారు. మంగళవారం పట్టణంలోని ఎంసెట్ కోచింగ్ సెంటర్లో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్ , రాజు, శశి నాగరాజు, గౌస్, వీరేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో.. ఆదోని: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూపాల్ చౌదరి మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెకల్ రామకృష్ణ, బుదా రెడ్డి, రంగన్న, అయ్యన్న, శశి రెడ్డి, బసవరాజు, లక్ష్మీనారాయణ, ఐసి రామకష్ణ, సదుల్లా, వీరేష్, నాగరాజ్, సోము, నారాయణ, వెంకటేష్, సోము, రవి, మల్లికార్జున, హనుమంతు, రామంజి, మురళి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** జ్యోతిరావు పూలే గొప్ప అభ్యుదయ వాది అని పట్టణ తెలుగుదేశం నాయకులు దయాసాగర్, రంగస్వామి గౌడ్, కలిముల్లా, మధుబాబు, ఉరుకుందయ్య శెట్టి అన్నారు. పట్టణ టిడిపి కార్యాలయంలో మాహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

ఎమ్మిగనూరు : విద్య ద్వారా కులరహిత సమాజాన్ని నిర్మించగలమని అణగారిన వర్గాల ప్రజలకు చదువు చెప్పించిన మహాత్మ జ్యోతిరావు పూలే అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యన్.నాగమణి, జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక ప్రాంతీయకార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళిఅర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లారి నాగరాజు,జిల్లా కార్యదర్శి దేవపాల్, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, యం రాజు,లక్ష్మన్న,, వై.రామాంజనేయులు, ప్రసాద్,భాగ్యరాజు, సుధాకర్, రవికుమార్, గురుస్వామి, జి.బాబు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: టీడీపీ ఆధ్వర్యంలో..

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

సుంకన్న (ఫైల్)

మండల కేంద్రమైన చిప్పగిరిలో పారిశుధ్య కార్మికుడిగా 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సుంకన్న (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సుంకన్న కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చులకు గాను జడ్పిటిసి విరుపాక్షి రూ.5000, గ్రామ పంచాయతీ తరపున సర్పంచ్ గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం మరో రూ.5 వేలను కుటుంబానికి అందజేశారు. సుంకన్న పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడని, ఉన్న పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబానికి ఆర్థిక చేయూత అందివ్వాలని స్థానికులు కోరారు.



అంబులెన్సులో చికిత్సలు అందించిన దృశ్యం

కుటుంబ సభ్యులు ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి

ప్రజాశక్తి -ఆదోని

కుటుంబ సభ్యులు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన ఆదోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఆర్‌పిఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు ఇలా మేరకు... తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా, తెరమన్‌బట్టు తాలూకా సాదగర్ గ్రామానికి చెందిన పద్మనాభం, భార్య శెల్వి దంపతులు తమ కూతురు జీవితతో కలిసి ఆదోని రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫామ్ రైలు కింద పడేందుకు యత్నించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న హోంగార్డు ఖాద్రీ అప్రమత్తమై వారిని పక్కకు తోశాడు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. వెంటనే 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ కోలుకోక పద్మనాభం మృతి చెందాడు. ఈ ఘటనకు కుటుంబ సమస్యలే కారణమని బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హోంగార్డు ఖాద్రిని పలువురు అభినందించారు.

కోట్ల సుజాతమ్మకు కేకు తినిపిస్తున్న మాలిక్ బాష

కోట్ల రాఘవేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - దేవనకొండ

స్థానిక టిడిపికార్యాలయంలో మండల టిడిపి కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, మల్లయ్య, ఉచ్చిరప్ప, మాలిక్ బాష, బండ్లయ్య, రాజా సాబ్, మస్తాన్, సుభాన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: ADONI
I.A 110/2022 IN O.S NO. 226/2016

Between:-
S.Raghavendrappa. ...Petitioner/Plainitff
Vs
S.Nagaraju & others. ...Respondents

To
Respondent No 13. M.Raghu S/o M.B.Nagappa
Respondent No 14. Banda Sarojamma D/o M.B.Nagappa
Respondent No 15. M.Chamundeswari D/o M.B.Nagappa
Respondent No 16. M.Buvaneswari D/o M.B.Nagappa

Respondents No 13 to 16 are residents of D.No 7/101 Near Sri Neelakanteswara Temple Yemmiganur POST.

The above named petitioner filed the above petition U/o 22 R 4 CPC to add you Legal representatives of M.Nagamma in the above case. The above case is posted to 17.04.2023 at 10.30A.M. & if any one got objections can appear before the above said court otherwise the matter will be decided exparte.

M.Sreedhar Reddy,
M.Satyasri,
Advocates for Petitioner's
Adoni Phone No 9441263921

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ఎండ @ 43

- తీవ్రమైన భానుడి భగభగలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారంలోనే 41 డిగ్రీల ఉష్ణోగ్రతతో భానుడు భగభగలాడగా ఆ ఎండ 43 డిగ్రీలకు చేరింది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతున్నాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి చివరి వారం నుంచి భానుడు భగభగలాగుతున్నాడు. రోజు రోజుకూ జిల్లాలో వేసవి తీవ్రత అధికవుతోంది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గత నెల మొదటి వారంలో నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆత్మకూరులో 36 డిగ్రీలు, డోన్‌లో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి 26న ఉష్ణోగ్రత నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో 41 డిగ్రీలను తాకింది. ఆత్మకూరులో 40 డిగ్రీలు, డోన్‌లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం జిల్లాలో రికార్డు స్థాయిలో ఆళ్లగడ్డ, చాగలమర్రిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాలలో 42, ఆత్మకూరులో 41

డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జిల్లాలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఆ సంఖ్య ఇప్పుడు 43కు చేరింది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

14 నుండి ప్రచార క్యాంపెయిన్

- జయప్రదం చేయండి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లాలో ఈ నెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ నాయకత్వంలో చేపట్టే ప్రచార క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఉపాధి లేని పేదలు మరింత పేదరికంలోకి వెళ్తున్నారని అన్నారు. నిరుద్యోగ సమస్య 10 శాతం పైగా దేశంలో పెరిగిపోతుందని చెప్పారు. వ్యవసాయ కార్మికుల ఉపాధి హామీ నిధులు కూడా కేంద్ర ప్రభు త్వం ప్రతి సంవత్సరం తగ్గించి వేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ కూడా ప్రైవేట్ వారికి అప్పజెప్పడం వల్ల ఉద్యోగ భద్రత లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పేరుతో తక్కువ వేతనాలతో కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని చెప్పారు. ప్రకృతి సంపదనంతా కూడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పి దేశాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం దోపిడీ చేస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య మతచిచ్చు పెట్టి అనేక వివాదాలతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపైన దేశద్రోహం కేసులు పెడుతూ ప్రతిపక్ష నాయకులపై, రాజ్యాంగ సంస్థలతో దాడులు చేయిస్తూ ఈ ప్రభుత్వం నియంతృత్వంగా పరిపాలిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జిల్లాలో ఈ నెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ నాయకత్వంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తూ, సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలని ప్రచార క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపెయిన్ జయప్రదం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

బుధవారం
ఇఫ్తార్ : 6 : 37

గురువారం
సహేరి : 4 : 41

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు - జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి జ్యోతిరావు పూలే అని, ఆయన ఆశ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నంద్యాల జిల్లాతో పాటు జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతిని జిల్లా అధికార యంత్రాంగం, పలువురు ప్రజాప్రతినిధులు, బిసి, దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళ్లులర్పించారు. నంద్యాలలోని పద్మావతి నగర్ సర్కిల్‌లో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, డిఆర్‌ఓ బెజ్జం పుల్లయ్యలు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంపీ మాట్లాడుతూ నంద్యాల నూతన జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా మాట్లాడుతూ అప్పట్లో మహిళలు విద్యావంతులైతే దేశం అభివృద్ధి చెందుతుందని మొదట తన సతీమణికి విద్య నేర్పించి మహిళా (మిగతా 6వ పేజీలో...)

జ్యోతిరావు పూలే జయంతిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

నిరీక్షించి... నీరసించి..

- తహశీల్దార్ కార్యాలయం ముందు ప్రజల ఎదురుచూపు
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు - కనీస సౌకర్యాలు తాగునీరు, బల్లలు, నీడ వసతి శూన్యం..

తహసీల్దార్ కార్యాలయం ముందు అలసిపోయి నేలపై కూర్చున్న మహిళలు

రెవిన్యూ ఇన్స్పెక్టర్ చాంబర్ ముందు క్యూ కట్టిన ప్రజలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదో ఒక పథకం ప్రవేశపెట్టినప్పుడల్లా ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలకొరకు ప్రజలకు పాట్లు తప్పడం లేదు ఇటీవల కేంద్రం ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. ఈ వాత్సల్య పథకం నిరాధరణకు గురైన బాలబాలికలు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని శిశు సంక్షేమ శాఖ ప్రకటన జారీ చేసింది. ఈ మేరకు ఈ పథకానికి అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం నంద్యాల మండలంలోని తహశీల్దార్ కార్యాలయానికి ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. మంగళవారం కార్యాలయంలో తాహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నంద్యాల తహశీల్దార్ వెలుగోడు మండలానికి కూడా ఇంచార్జ్ కావడంతో ఆయన వెలుగోడుకు వెళ్లారని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. మిషన్ వాత్సల్య పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమయం కేవలం నాలుగు రోజులే ఉండటంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అధికారుల కోసం ఎదురు చూసి కార్యాలయం ముందు నిరీక్షించి నీరసించిపోయారు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఒకరుంటే ఒకరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కుల ధ్రువీకరణ పత్రాలు మాత్రమే కంప్యూటర్‌లో నమోదు చేశారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మాత్రం కంప్యూటర్ ఆపరేటర్ లేక పెండింగ్‌లో ఉండి పోయాయి. మంగళవారం అధికారులు లేక కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇదే అదునుగా కార్యాలయంలోని సిబ్బంది కొంతమంది తమ చేతివాటం చూపిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంబంధం లేని వ్యక్తి పెత్తనం

కార్యాలయానికి సంబంధం లేని ఓ వ్యక్తి కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నట్లు సమాచారం. అతడు కనీసం తలారీ కూడా కాదని, తాను పని చేసి పెడతాను అని ప్రజల దగ్గర డబ్బులు వసూల్ చేస్తున్నారని, తాను కట్టలు కట్టలు తీసుకెళ్లిన మాట్లాడకుండా అధికారులు సంతకాలు చేస్తున్నారని కొందరు చెబుతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు కూడా తాను తెచ్చిన దరఖాస్తులు క్షణల్లో ఒకే చేసేస్తారని, సామాన్య ప్రజల దరఖాస్తులు మాత్రం అక్కడ పెట్టేసి వెళ్ళండని, పది రోజుల తరువాత రండి అని చెప్పున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకి ఆ వ్యక్తికీ అధికారులకు ఏ రకమైన సంబంధం ఉందోనని, అధికారులు ఆర్థిక లావాదేవీలు ఏమైనా సాగిస్తున్నారా? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

తాహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో సబ్ రిజిస్టర్, ట్రెజరరీ, రూరల్ పోలీస్ స్టేషన్ లాంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి, కాబట్టి ప్రజలు ఏదో ఒక పని మీద వేల సంఖ్యలో కార్యాలయాలకు వస్తుంటారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గుక్కెడు నీళ్లు దొరక్క కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోడానికి వసతి లేక, నీడ లేక ఇబ్బందులకు గురవున్నామని ప్రజలు వాపోతున్నారు.

సైన్స్ ప్రశ్నపత్రంపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సైన్స్ ప్రశ్న పత్రంపై విద్యార్థులకు ఇన్విజిలేటర్లు అవగాహన కల్పించాలని డిఇఒ అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ పరీక్షలో ఒకే ప్రశ్నా పత్రంలో ఫిజికల్, బయాలాజికల్ సైన్స్ ప్రశ్నలు ముద్రించారని, భాగము-ఎలో ఫిజికల్ సైన్స్ ప్రశ్నలు క్రమ సంఖ్య 1 నుండి 16 వరకు, భాగం-బిలో పార్ట్ -బి) నందు బయాలాజికల్ ప్రశ్నలు క్రమ సంఖ్య 17 నుండి 33 వరకు ముద్రించినట్లు తెలిపారు. జవాబులు రాయడానికి విడివిడిగా ఓఎంఆర్‌లు ఉన్న రెండు 12 పేజీల జవాబు పత్రాలు ఒకేసారి అందిస్తారని, విద్యార్థులు సమాధానాలు రాసేటప్పుడు ఫిజికల్ సైన్స్ జవాబుపత్రంలో ఫిజికల్ సైన్స్ సమాధానాలను, బయాలాజికల్ సైన్స్ జవాబుపత్రంలో బయాలాజికల్ సైన్స్ సమాధానాలను మాత్రమే రాయాలని సూచించారు. కావున ఇన్విజిలేటర్లు పరీక్షకు ముందు గదిలోని విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కల్పించి కేటాయించిన జవాబు పత్రంలో మాత్రమే సమాధానాలు రాసే విధంగా జగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

డోన్‌లో కేంద్రీయ విద్యాలయానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. విద్యాశాఖకు భూమిని అప్పగిస్తే డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారి వర్గాలు వెల్లడించాయి.

మార్కెట్ యార్డ్‌లో చలివేంద్రం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైస్ చైర్మన్ నరహరిలు చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, దాహం, వడదెబ్బ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు రైతులు, హమాలీల, ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సురేష్, సహాయ పర్యవేక్షకులు నరేష్ , వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

- పోస్టల్ సూపరిండెంట్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని నొస్సం సబ్ పోస్ట్ ఆఫీస్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ గురించి వివరించారు. మహిళలు కనిష్టంగా 1000 రూపాయలు, గరిష్టంగా రెండు లక్షల రూపాయల వరకు డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. గరిష్ట కాలపరిమితి రెండు సంవత్సరాలని, రెండు లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తే 7.5 శాతం వడ్డీతో కలిపి రూ.2,30,854 మొత్తం తీసుకోవచ్చన్నారు. సంవత్సరం తర్వాత అవసరం అనుకుంటే 40 శాతం విత్ డ్రా చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జయలక్ష్మి అనే మహిళకు మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో నొస్సం పోస్టుమాస్టర్ జాకీర్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని గుండ్ల సింగవరం గ్రామంలో రూ. 2కోట్ల 60 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, భవనాలను ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంబించారు. గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ క్లినిక్, ప్రాథమిక పాఠశాల నూతన భవనాలను బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డిలు నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, అవుకు ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, గుండ్ల సింగవరం సర్పంచి కాటసాని రమాకాంత్ రెడ్డి, వైసిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం బనగానపల్లె ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి సిఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ సొంత గ్రామం గుండ్ల సింగవరంలో ప్రజల కోసం, గ్రామ అభివృద్ధికి నిరంతరం పని చేస్తూనే ఉంటామని తెలిపారు. నంద్యాల ఎంపీ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా భవనాలను నిర్మించి గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీవో అజాం ఖాన్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ బాబు, ఎంఇఒ శ్రీధర్ రావు, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాదరావు, డాక్టర్లు వినోద్ కుమార్, యమునా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, జెడ్పి చైర్మన్ తదితరులు

రైతు సమస్యలు పట్టించుకోని కేంద్రం : ఎఐకెఎస్

బేతంచెర్ల : జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

రెండవసారి అధికారంలోకి వచ్చి ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా గాలి వదిలేసిందని ఏఐకెఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు విమర్శించారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏఐకేఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక నాయకులు నీలి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతులు ఐక్యమత్యంతో బలపడి ఐక్య ఉద్యమాలు చేస్తే రైతన్న ఉద్యమాలు బలపడతాయన్నారు. చిన్న సన్న కారు రైతులందరూ కలిసి ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, పరమేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మధు గౌడ్, చిట్టి మద్దయ్య, చిన్న రాముడు, మాసుం భాష, మద్దయ్య, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు : బిజెపి ప్రభుత్వం రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు బి.రామేశ్వరం విమర్శించారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగాల గ్రామంలో మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీనియర్ రైతు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామేశ్వరం మాట్లాడుతూ రైతు సంఘం 1936లో ఆవిర్భవించి భూసంస్కరణ ద్వారా దేశంలో లక్షలాదిమందికి భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించిందన్నారు. చిన్న, సన్నకారు రైతాంగానికి రైతు సంఘం అండగా ఉండి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. దేశంలో బిజెపి వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, చిన్న అంబయ్య, రవణమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జూపల్లె రాకేష్ రెడ్డి

బండ లాగుడు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈస్టర్ పండగ సందర్భంగా సాంబవరంలో బండ లాగుడు ఎద్దుల పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీలను ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జూపల్లె రాకేష్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జూపల్లె ప్రభాకర్ రెడ్డి, సర్పంచి ఐజయ్య, జూపల్లె జనార్ధన్ రెడ్డి, రాజన్న, దేవ సాయం, పి.వెంకటస్వామి, పి.జమాల్ ప్రకాశం, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిహెచ్‌సి వైద్యులు భావన, సవిత సూచించారు. మంగళవారం బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా 60 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ మాధవి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి -ప్యాపిలి

స్థానిక జామియా మసీదులో కమిటీ అధ్యక్షుడు మస్తాన్ ఖాన్, సభ్యులు మహబూబ్ సాహెబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, నగదు మంగళవారం పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన ఇస్మాయిల్ కొద్ది సంవత్సరాల కిందట హైదరాబాదులో స్థిరపడ్డారు. ఇస్మాయిల్‌తో పాటు అతని కుమారుడు జాకీర్ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ముస్లిం బాలురకు దుస్తులు, బాలికలకు స్కాఫులు పంపిణీ చేస్తున్నారు. పట్టణానికి చెందిన 38 మంది మహిళలకు చీరలు, 33 మందికి 300 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో గపూర్, మహబూబ్ బాషా, రహమతుల్లా, మహమ్మదు, భాష, కాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మైనార్టీ సోదరులు

అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్పీ చైర్మన్

సుంకులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే, జడ్పి చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని బెలుం శింగవరం గ్రామంలోని వెలసిన సుంకులమ్మ ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌లు మంగళవారం దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన నాయకులు పేరం రామ శంకర్ రెడ్డి చేసిన దేవర కార్యక్రమానికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చల్లా విఘ్నేశ్వర రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి రెడ్డి, పక్కీరా రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డిలు హాజరయ్యారు. అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు, హెల్త్ అలవెన్స్‌లు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు పెండింగ్ జీతాలు, హెల్త్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గోగుదు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జీవన్ కుమార్‌కు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన రంచనుగా జీతాలు చెల్లిస్తామంటూ వైసిపి ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వచ్చినప్పటికీ మార్చి నెల జీతాలు కార్మికులకు చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుండి కార్మికులకు నేరుగా చెల్లించే హెల్త్ అలవెన్స్‌ను సైతం చెల్లించకపోవడం విచారకరమన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రామన్న, రాజేంద్ర, విజయ్ కుమార్, రమేష్, భూషన్న, లింగస్వామి, దానమయ్య, చిన్న నందయ్య, మరియమ్మ, దర్గమ్మ, సుశీలమ్మ, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తమ్మరాజుపల్లెలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని తమ్మ రాజు పల్లె గ్రామంలో వైసిపి నాయకుడు బత్తుల శేషు రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూల్ మెడికేర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ప్రవీణ్, సెంట్రల్ హెడ్ మహేశ్వర రెడ్డి, జీఎం నీలా రెడ్డి, క్యాంప్ ఇంచార్జి ప్రశాంత్‌లు పాల్గొని గ్రామస్తులకు బిపి, షుగర్, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సంగమేశ్వరుడి సన్నిధిలో రాయలసీమ జోన్ హోంగార్డు ఎస్‌పి

ప్రజాశక్తి - కొత్తపల్లి

సప్త నదుల సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వరుడిని రాయలసీమ జోన్ హోంగార్డు ఎస్‌పి మహేష్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఉన్న వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పలు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు పురోహితులు ఆలయ చరిత్రను వివరించారు. ప్రశాంతత, భక్తి భావనకు మారుపేరు సంగమేశ్వర క్షేత్రమని ఎస్‌పి కొనియాడారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎస్పి మహేష్ కుమార్

జీవనోపాధికి గండికొడితే సహించం

- బాధితులకు అండగా ఉంటాం : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేదల జీవనోపాధికి గండి కొట్టే చర్యలకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ముందుగా ఉన్న బంకులను మున్సిపల్ అధికారులు తొలగించే చర్యలను నిరసిస్తూ బాధితులకు తాను అండగా ఉంటానని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఆమె ఆసుపత్రి ముందర ఉన్న దుకాణాలను పరిశీలించారు. బాధితులు ఆమెతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం పట్టణంలో అభివృద్ధి పేరుతో డ్రైనేజీ విస్తరణ కోసం ఇవే దుకాణాలను మున్సిపాలిటీ అధికారులు తొలగించారన్నారు. ఆ రోజునే వారికి శాశ్వత జీవనోపాధి చర్యలు చేపట్టింటే బాగుండేదన్నారు. డ్రైనేజీ పనులు పూర్తయ్యాక స్థానిక వైసిపి నాయకులు దుకాణాల నుండి డబ్బులు వసూలు చేసి మరల అక్కడనే ఏర్పాటు చేయించారన్నారు. ఆ డబ్బు మున్సిపాలిటీ అధికారులకు చేరిందో లేదో అధికారులకే తెలియాలన్నారు. అప్పుడు అనుమతులు ఇచ్చి ఇప్పుడు ఎలాంటి నోటీసులు లేకుండా దుకాణాలను ఎలా తీసివేస్తారని ప్రశ్నించారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం కనపడలేదని బంకులను తీసివేసే ప్రయత్నాలను అధికారులు, వైసిపి నాయకులు చేపట్టారన్నారు. పోనీ ఆ భవనం ఎంత సుందరంగా ఉందో చూసి చూశానని, ముందర సోకు చేశారు కానీ, లోపల అంతా డొల్ల అని ఆమె ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ఆళ్లగడ్డకు వచ్చి ఇదు నెలలైనా ఆయన హామీ ఇచ్చిన 100 కోట్లు ఇప్పటికీ రాలేదన్నారు. దుకాణదారులకు శాశ్వత ప్రయోజనాలు చూపాకే వారి బంకులను అక్కడ నుండి తొలగించాలని, అలా కాకుండా అధికారులు ముందుకు వెళితే తాను చూస్తూ ఊరుకోనని, బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నాయకులు ఇటిక్యాల శేఖర్ రెడ్డి, నాగంజి తదితరులు పాల్గొన్నారు.

షాపులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

నివాళ్లులర్పిస్తున్న బిసి ఇందిరా

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు దస్తగిరి (90) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి అక్కడికి చేరుకుని దస్తగిరి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, టిడిపి నాయకులు పరామర్శించారు.

దళారులను నమ్మవద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి - మహానంది

ప్రభుత్వ పథకాల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని తహశీల్దార్ జనార్దన్ శెట్టి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని తల్లి లేక తండ్రి మరణించి ఉన్న లేక ఇద్దరు మరణించి ఉన్న వారికి సంబంధించి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న వారికి వర్తిస్తుందని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి, డిప్యూటీ తహశీల్దార్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

అమ్మవారికి వార్షిక కుంభోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో భ్రమరాంబ దేవికి సాంప్రదాయపద్ధంగా వార్షిక కుంభోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉత్సవంలో అమ్మవారికి గుమ్మడి కాయలు, నిమ్మకాయలు, టెంకాయలు, అన్నం రాసిని సాత్విక బలిగా సమర్పించారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సింహం మండపం వద్ద వండిన అన్నమును కుంభరాసిగా ఏర్పాటు చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించారు. ఈ ఉత్సవంలో భాగంగానే శ్రీశైలం గ్రామ దేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గుమ్మడికాయలు, నిమ్మకాయలు, టెంకాయలు సమర్పించారు.

రైతు చెంతకే భూసార ఫలితాలు

- జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రైతు చెంతకే భూసార పరీక్ష ఫలితాలు అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు వెల్లడించారు. మంగళవారం నంద్యాల మండలం పాండు రంగాపురం గ్రామంలోని ఆర్‌బికె సెంటర్‌లో భూసార పరీక్ష శిక్షణా కార్యక్రమాన్ని ఆన ప్రారంభించారు. స్పెషల్ కమిషనర్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 2వ వారాన్ని మట్టి పరీక్ష శిక్షణ వారంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా భూభౌగోళిక స్థితి, నేలల సారవంతం, ఎరువుల వినియోగంపై తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌నకు అధికారులందరూ 50 మట్టి నమూనాలను సేకరించి కర్నూలులోని మట్టి పరీక్ష కేంద్రం భూసార పరీక్ష ఫలితాలకు పంపాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎడిఎ, ఎంఎఓలు, ఆర్‌బికే సిబ్బందికి ఏప్రిల్ 15 లోపల శిక్షణ ఇవ్వాలని, ప్రతి మండలంలో ప్రతి ఆర్‌బిఎ నుంచి 20 మట్టి నమూనాలను సేకరించి పంపాలని తెలిపారు. మొదటిది సాంకేతిక సెషన్, రెండవది ప్రాక్టికల్ సెషన్. రిసోర్స్ పర్సన్‌గా కెవికె, యాగంటి పల్లి నుండి భూ శాస్త్రవేత్త రమణయ్య పాల్గొని పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారులు, డిఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారం చూపించే బాధ్యత అధికారులదేనని ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ అజాం ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ బాబు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ టి వినోద్ కుమార్ హాజరయ్యారు. పశు వైద్యురాలు డాక్టర్ భారతి దేవి, వ్యవసాయ అధికారి ప్రసాదరావు, ఆరోగ్యమిత్ర ఎన్ ఎఈ కరీముల్లా, పంచాయతీ రాజ్ ఏఈ భాషలు తమ శాఖల పరిధిలో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జాతీయ, ఆర్అండ్‌బి, మైనర్ ఇరిగేషన్ అధికారులు హాజరు కాకపోవడంతో వారి తీరుపై మండల సభలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఎంపిడిఓకు ఎంపిపి సూచించారు. డాక్టర్ టి.వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు 12 గంటలకల్లా కార్యకలాపాలు ముగించుకోవాలని ఇంటికి చేరుకోవాలన్నారు. అవసరం అయితేనే బయటకు వెళ్లాలనుకుంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకెళ్లాలని తెలిపారు. వలివేంద్రంలోనే ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రతి ఒక్కరికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవుకు పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని అదనంగా నవాబ్ ఒక కోటి 40 లక్షలతో రెండు లక్షల 50 వేల లీటర్ల కెపాసిటీతో వైయస్సార్ ట్యాంకును నిర్మిస్తున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ ఎఇ తెలిపారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో మట్టి నమూనా పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు చిరుధాన్యాలను పండించేలా చర్యలు తీసుకుంటామని, అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోవరం గోపాల్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జడ్పిటిసి, అధికారులు

గడప గడపకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శిరివెళ్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గడప గడపకు చేరుతున్నాయని, అందువల్లే సగర్వంగా జనంలోకి వెళుతున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వీరారెడ్డి పల్లెలో సర్పంచ్ మందాల రాధిక శివారెడ్డి అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం సర్పంచి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపిటి నాయక్ మహమ్మద్ వసం, వీరారెడ్డి పల్లె ఉప సర్పంచ్ విజయ్ రెడ్డి, సర్పంచ్ మేర్వ చిన్న నరసింహ రెడ్డి, అబ్దుల్ సలాం, నజీర్, డి గుర్రప్ప, నాయక్ ముజఫర్ హుస్సేన్, సుబ్బ సత్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, చంద్ర, రవీంద్ర రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి

అడుక్కుతినే రాష్ట్రంగా మార్చారు : మాజీ మంత్రి

ప్రజాశక్తి - చాగలమర్రి

అన్నపూర్ణ రాష్ట్రంగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌ను వైసిపి ప్రభుత్వం వచ్చాక అడుక్కుతినే రాష్ట్రంగా మార్చారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. చాగలమర్రి పట్టణంలోని గుంతపాలెం వీధిలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి ఉత్పత్తిలో దేశంలోనే మంచి పేరుగాంచిన రాష్ట్రానికి సరైన సమయంలో నీరు, విద్యుత్ సరఫరా లేక వరి సాగు చేసే రైతులే కరువయ్యారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయడం లేదని ఆ పార్టీ సర్పంచులే చెప్పుతో కొట్టుకునే పరిస్థితి నెలకొందని, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. ఏం ఘనకార్యం చేశారని ఇంటింటికీ స్టిక్కర్లు కరిపిస్తున్నారని, స్టిక్కర్లు కరిపించాల్సింది ప్రజల గోడలకు, ఇక్కడ కాదని ఎలాంటి అభివృద్ధి చెయ్యని ప్రజాప్రతినిధులు, నాయకుల ముఖాలకు కరిపించాలన్నారని ఆరోపించారు. త్వరలో జిల్లాలో ప్రారంభం కానున్న నారాలోకేష్ పాదయాత్రను పండగ వాతావరణంగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు అన్వర్ బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, డిప్యూటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, నంద్యాల బీసీసెల్ స్టోక్ పర్సన్ సల్లానారాయణ, ఐటిడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు శిగ్గా రెడ్డి, నాయకులు కొలిమి ఉసేన్ వలి, కొలిమి షరీఫ్, మహ్మద్, మౌలాలి, గఫార్, హనీఫ్, నాగూర్, జెట్టి నాగరాజు, బషీర్, ఇర్షాద్, లక్ష్మీనారాయణగౌడ్, గంగుల భాస్కర్, కసినేని ఓబులేసు, వీరారెడ్డి బాస్కర్‌రెడ్డి, నాగేషు, అబ్బుల్లా, శేఖర్రెడ్డి, గురుశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, శెట్టివీడు నరసింహారెడ్డి, రాంపల్లె అబ్బిరెడ్డి, వెంకటేశ్వర్రెడ్డి, లుక్మాని ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

సంక్షేమ ప్రభుత్వానికే పట్టం కట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రుద్రవరం

సంక్షేమ పథకాలు అందించే వైసిపి ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం రుద్రవరంలోని కస్తూర పరమేశ్వర ఉన్నత పాఠశాలలో వైయస్సార్ ఆసరా 3వ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడే కొద్ది వివిధ పార్టీలకు చెందిన వారు మోసపూరిత మాటలతో వస్తూ ఉంటారన్నారు. వారి మాటలు పట్టించుకోకుండా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. అనంతరం మండలంలోని 662 పొదుపు గ్రూపులకు రూ.4 కోట్ల 59 లక్షల 28 వేల 086 మెగా చెక్కును పొదుపు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, జడ్పిటిసి వీరపాండియన్, ఎంపిపి ముబ్బు బాలస్వామి, నోడల్ అధికారి డాక్టర్ గిడ్డయ్య, ఎంపిడిఓ మధుసూదన్ రెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, వైసిపి నాయకులు గంగిరెడ్డి తిమ్మయ్య, నాగేశ్వర రెడ్డి, లింగందిన్నె హరి నారాయణ, మహేశ్వర రెడ్డి, దేవగుడి జాకీర్ హుస్సేన్, బైరి శంకర్, బైరి బ్రహ్మం, శిరువెల్ల రెడ్డి, హరినగరం నాగముని, అధికారులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగన్ పాలనపై జనంలో నమ్మకం : వైసిపి

ప్రజాశక్తి - శిరివెళ్ల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయ్యిందని మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గాడె కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని యర్రగుంట్ల గ్రామంలోని 5వ వార్డులో సచివాలయం-2 పరిధిలోని ఎస్సీ కాలనీలో జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సర్పంచ్ అయ్యలూరి శుభాన్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రమణయ్య, వంకం వెంకట సుబ్బయ్య, వార్డు సభ్యులు మిద్దె పెద్ద ఓబులేసు, గృహ సారథులు చంద్రయాదవ్, మిద్దె రాణి, వార్డు వాలంటీర్ మిద్దె శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని చింతలాయపల్లెలో 'మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైసిపి నాయకులు మంగళవారం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, సచివాలయం కన్వీనర్లు చంద్రమోహన్ రెడ్డి, జయరామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వాలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

మహారాష్ట్రంలో డోన్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

IP No. 69/2022

పింజరి ఫక్రుద్దీన్ S/o. D. రంగావలి వయస్సు 34 సం॥ ముస్లిం, కూలి, R/o. 1/1-1, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్ & మండలం, నంద్యాల జిల్లా ..... అర్జీదారు

V/s.

R(1) పింజరి షేక్షావలి, S/o. P. అలీ సాహెబ్ వయస్సు 42 సం॥ ముస్లిం, అటో డ్రైవర్, శ్రీనివాసనగర్, R/o. 8/40-26, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(2) వడ్డే శివ, S/o. V. గిడ్డయ్య హిందూ, 33 సం॥ డ్రైవర్ R/o. 25-59-37/13, గుత్తిరోడ్డు, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(3) వడ్డే లక్ష్మిదేవి, W/o. వడ్డే శివుడు (లేట్), 45 సం॥ హిందూ వ్యాపారం, R/o. H.No. 1-32-1-3-9, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(4) షేక్ హుస్సేన్ బీ W/o. లేట్ సలీంబాషా, వయస్సు 50 సం॥ ముస్లిం, గృహిణి, R/o. H.No. 1-107-1, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(5) షేక్ హసి బీ W/o. అబ్దుల్ అమీర్, వయస్సు 42 సం॥ ముస్లిం, గృహిణి, R/o. 1-33-1-3-9, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(6) పఠాన్ ముంతాజ్ బేగం W/o. లేట్ P. వలి, వయస్సు 40 సం॥ ముస్లిం, గృహిణి R/o. పోస్టాఫ్ మందిరం వెనుక, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(7) దేవప్ప గారి చంద్రవలి W/o. సురేష్ వయస్సు 24 సం॥ హిందూ, గృహిణి, R/o. H.No. 1-131-9-1, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

R(8) సువర్ణ, W/o. సుధాకర్, వయస్సు 30 సం॥ హిందూ, గృహిణి R/o. H.No. 1-132-9-1, త్రివర్ణకాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.

..... రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం. (8) నోటీస్

నంద్యాల జిల్లా డోన్ మండలం, డోన్ టౌన్ త్రివర్ణకాలనీ ఇంటి నెం. 1-132-9-1, నందు నివాసం కలిగి ఉన్న సుధాకర్ భార్య అయిన సువర్ణ ఎరిగిందుట రెస్పాండెంట్‌గారికి తెలియజేయడం ఏమనగా పై తెలిపిన అర్జీదారు తనను Insolvent పర్సన్‌గా ప్రకటిస్తూ ఉత్తర్వులు పొందవలెనని మీ పైన పై తెలిపిన I.P. 69/2022 కేసును పై తెలిపిన కోర్టులో దాఖలు చేసి యున్నారు. ఇందు గురించి మీకు అభ్యంతరాలు ఉన్న యెడల పై తెలిపిన కోర్టు వారి ఎదుట 13-4-2023వ తేదీన ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని తప్పక హాజరు అయ్యి మీ యొక్క అభ్యంతరాలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున కేసు తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 13-04-2023

By Order of Court

ఇట్లు
కావాల మహేష్
జె. రవి మోహన్
అర్జీదారు తరపు న్యాయవాదులు
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9441656595, 9440859827

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

నంద్యాలలో నివాళ్లులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా

ఆత్మకూరు : నివాళ్లులర్పిస్తున్న సిపిఎం నాయకులు

(5వ పేజీ తరువాయి...) ఉపాధ్యాయురాలిగా పూలే తీర్చిదిద్దారన్నారని అన్నారు. బాలికలకు మహిళా పాఠశాల ఏర్పాటు చేసి తన భార్య ద్వారా విద్య నేర్పించారని చెప్పారు. ఈ వేడుకల్లో అధికారులు, జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సలోమి, వివిధ సంఘాల నాయకులు మంజుల, సుబ్బరాయుడు, బాలకృష్ణ యాదవ్, మద్దయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎఎస్‌పి ఆర్.రమణ, జి.చంద్రబాబు, ఆర్ఎస్‌ఐలు సోమశేఖర్, వీరన్న, హర్షవర్ధన్ రెడ్డి ,ఇల్లా ఫర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో : టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి తన నివాసంలో పూలే చిత్రపటానికి, అలాగే స్థానికపద్మావతి నగర్‌లోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిసి నాయకులు, వార్డ్ ఇంచార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బిసి సెల్ నంద్యాల డివిజన్ విభాగం అధ్యక్షుడు సుబ్బారాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు పరమేష్ ఎన్నికైనందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో : పద్మావతి నగర్ ఆర్చి దగ్గర గల పూలే విగ్రహానికి ఏపి పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి చింతల మోహన్ రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్యలు నివాళులర్పించారు. ఎపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకొట్టు వాసు, జిల్లా బిసి కమిటీ అధ్యక్షులు వర్ల రామకృష్ణ, జిల్లా ట్రెజరర్ ఎస్‌వైడి ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కరాటే బాలకృష్ణ, ఆనందరావు, కృష్ణ మైనారిటీ నాయకులు చాబోలి సలాం పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపోలో : నంద్యాల ఆర్‌టిసి డిపోలోని గ్యారేజ్‌లో ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు పూలే చిత్ర పటానికి నివాళ్ అర్పించారు. డిపో మేనేజరు ఎ.గంగాధర రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో : యుటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని బిసి సంఘం కార్యాలయంలో బిసి సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. బిసి సంఘం జిల్లా నాయకులు సిద్ధపు పాండురంగ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, దూదేకుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు స్టైల్ బైలర్ దస్తగిరి, గిరిజన సంఘం నాయకులు కోనేటి శ్రీనివాసులు, నందవరం సర్పంచ్ నాగరాజు, యాదవ, బిసి సంఘాల నాయకులు కొంగర పవన్ కుమార్, సాదు కొట్టం మహేష్ యాదవ్, లింగాల దేవేంద్ర యాదవ్, కైప సుధాకర్ యాదవ్, నందవరం శ్రీనివాసులు, బైలర్ మౌలాలి, వెంకటాపురం శ్రీనివాసులు, నాగేంద్ర పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ స్వర్ణలత దేవి, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కె.ఐడీ సోహెల్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు కే సత్య ప్రకాశం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, గొరవయ్యలు బి సుధాకర్ ,ఆర్థిక కార్యదర్శి ఎం విజయకుమార్ ,,జిల్లా ఆడిట్ మెంబర్ యు. దస్తగిరి, సిపిఎస్ మండల కన్వీనర్ ఎస్ లక్ష్మీ నాయక్, మండల అధ్యక్షుడు సి .కృష్ణయ్య, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలో, సింగరాజు పల్లె, గుమ్మడాపురం గ్రామాల్లో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఆత్మకూరు వ్యవసాయ డాక్టర్ నాగన్న, కస్టమ్స్ అధికారి వేల్పుల జయ ఆనంద్ కుమార్, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్.సంపత్‌లు నివాళు లర్పించారు.కార్యక్రమంలో సర్పంచి నక్క విజయ కుమార్, బాల ఎల్లయ్య, ఉప సర్పంచి బొల్లు శ్రీనివాసులు యాదవ్, ఎన్ఎస్ఎఫ్ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, బిసి నాయకులు నాగ శేషన్న, నాగేశ్వర యాదవ్, లింగ స్వామి గౌడ్, శంకర్ గౌడ్, నారాయణ, సుబ్బరాయుడు, ఇద్రుస్, బంగి నాగన్న, రవికుమార్, సూరి, రాజు, వెంకటరమణ, ఆనంద్, గోపాల్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **చాగలమర్రి :** పట్టణంలోని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో టిడిపి బీసీ సెల్ నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ సల్లా నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షులు బాల దస్తగిరి, నాయకులు బ్రాహ్మయ్య, ఆదాం, నీలం ధనుంజయుడు, వక్తర్దీన్, లాలు, ఉసేని పాల్గొన్నారు. **పగిడ్యాల :** ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ వెంకటరమణ, ఈఓఆర్‌డి పుల్లయ్య, జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఏపిఓ మద్దిలేటి, ఏపిఎం శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు రామ్ నాయక్‌లు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. నాయకులు రఫీక్, రైల్ భాష, మాబాష, మియాన, శేషయ్య, షఫీ, హుస్సేన్ షా పాల్గొన్నారు. **అలాగే** పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు, సంగమేశ్వర సర్కిల్లో పూలే విగ్రహానికి ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్పర్సన్ డాక్టర్ ఆసియా, వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష, సత్యశోధక సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ నాగన్న, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు రఘురాముడు నివాళులర్పించారు. కౌన్సిలర్లు విజయ చౌదరి, కో ఆప్షన్ సభ్యుడు ఎంఎం రషీద్, కౌన్సిలర్లు హరి, మారుబోతుల విజయ్, సుల్తాన్, బోయ లక్ష్మయ్య, పాణ్యం పార్వతి, రంగస్వామి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో ఎంపిడీవో సుమిత్రమ్మ పూలే చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఏవో కర్ర సాగర్, ఏపీఓ విమలమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని స్థానిక ఇందోర్ స్టేడియంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. అఖిలభారత కార్మిక సంఘం రాష్ట్రనాయకులు కరీంబాష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఉయ్యాలవాడలోని ఎంపీడీవో కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు నివాళులర్పించారు. ఉపాధి ఏపీవో శివ ప్రకాష్, వెలుగు ఏపిఎం శేఖర్, ఏఈఓలు వెంకటేశ్వర రెడ్డి, రామయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** టిడిపి నాయకులు ఎల్.శివరామి రెడ్డి, నంద్యాల ప్రసాద్, బైలర్ రాముడు, నాగార్జున రెడ్డి, దిష్ గోపాలులు టిడిపి కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. నాయకులు బాల్రెడ్డి శ్రీను, రత్నమయ్య, కోటపాడు బాబు, రాచకుంట శ్రీను, మందా నాగన్న, నారాయణ, ఆఫీస్ గోపాల్, మహేష్ పాల్గొన్నారు.

కొత్తపల్లి : నివాళ్లులర్పిస్తున్న నాయకులు

బనగానపల్లె : నివాళ్లులర్పిస్తున్న నాయకులు